దళిత మహిళపై
దాడి కేసులో మరో నలుగురి అరెస్టు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11: రామారెడ్డి పోలీసు స్టేషన్‌లోని పరిధిలో ఓ మహిళపై దాడి చేసిన కేసులో మరో నలుగురిని రిమాండ్ చేసినట్లు డీఎస్పీ ప్రకాష్ ఆదివారం తెలిపారు. రిమాండ్ చేసిన వారిలో మాచారెడ్డి మండలం లక్ష్మీరావులపల్లి గ్రామానికి చెందిన రేండ్ల రాజు, పుట్ట నర్సింలు, కాళ్ల దేవయ్య, రేండ్ల రాజులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది మంది నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.



కామారెడ్డిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

సమస్యల వలయంలో..
జిల్లా ఆస్పత్రి

- డీఎంఈ పరిధిలోకి మారినా మెరుగుపడని సౌకర్యాలు
- శిథిలావస్థకు చేరిన భవనంపైనే నిర్మాణ పనులు
- ఆయా విభాగాల్లో ఎలుకల సంచారం
- గతంలో పలువురు రోగులను గాయపరిచిన ఎలుకలు
- తాజాగా ఐసీయూలో రోగిని తీవ్రంగా గాయపరిచిన ఎలుకలు
- ఆసుపత్రికి వచ్చేందుకు జంకుతున్న రోగులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి మారినా సౌకర్యాల లేమీతో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఆసుపత్రి భవనం ఏన్నో సంవత్సరాల క్రితం నిర్మించడం 100 పడకల ఏరియా ఆసుపత్రిగా ఉన్న సమయంలోనే భవనం శిథిలావస్థకు చేరింది. అయినా అదే భవనంలో మరిన్ని పడకలు ఏర్పాటు చేసి ఇతర విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ తర్వాత గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుని కామారెడ్డికి సైతం మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. దీంతో మెడికల్ కళాశాల అనుబంధంగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని కేటాయించి సేవలు కొనసాగిస్తున్నారు. మెడికల్ కళాశాల, అనుబంధ ఆసుపత్రిని కొనసాగించాలంటే తగిన పడకలు, సౌకర్యాలు చూపించాలనే ఉద్దేశ్యంతో ఉన్న ఆసుపత్రిలోనే పైభాగంలో మరిన్ని గదులను ఏర్పాటు చేశారు. గతంలోనే ఆసుపత్రి ఇరుకుగా ఉండడం, భవనం పలుచోట్ల శిథిలమైనా మళ్లీ ఆ భవనంపైనే నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణాలు జరుగుతున్న సమయంలోనే కింది అంతస్తులో పలుచోట్ల ధ్వంసమై భారీగా గుంతలు ఏర్పడి ఎలుకలకు రాచమార్గాలుగా మారాయి. ఆ మార్గాలను ఇప్పటికే పూడ్చివేయకపోవడంతో ఆ దారిగుండా వస్తున్న ఎలుకలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను గాయపరుస్తున్నాయి. ప్రస్తుతం ఇదే తరహాలో ఐసీయూలో అపస్మారక స్థితిలో ఉండి చికిత్స పొందుతున్న ముజీబ్ అనే రోగి చేతివేళ్లకు, కాళ్లకు తీవ్ర గాయాలు చేశాయి. ఎలుకలు గాయాలు చేస్తున్నా అతనికి స్పృహలేకపోవడంతో కుటుంబీకులు గుర్తించి ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు. వెంటనే అతనికి వైద్యసిబ్బంది ప్రథమ చికిత్సను అందించి కింది స్థాయి సిబ్బందితో ఎలుకలను తరిమేందుకు పలు ఏర్పాట్లు చేయించారు.



చికిత్స పొందుతున్న ముజీబ్



ముజీబ్ కాలు, చేతులను గాయపరిచిన ఎలుకలు

ఎలుకలను నివారించడానికి పలు ఏర్పాట్లు చేసినా భవనం పాతది కావడం, పేషంట్ కేర్ టెకర్‌లు పరిసర ప్రాంతాల్లోనే భోజనాలు చేసి అక్కడే మిగిలిన వ్యర్థాలను పడేస్తున్నారని కొందరు రాత్రి సమయంలో ఏకంగా పేషంట్ల వద్దనే భోజనాలు చేసి వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారని ఆ వ్యర్థాలను తినేందుకు వస్తున్న ఎలుకలు ఎక్కువగా పెరిగిపోతున్నాయని ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు.

రోగులపై ఎలుకల దాడి

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రాత్రి ఐసీయూలో ముజీబ్ అనే వ్యక్తితో పాటు మరికొంత మంది రోగులకు సైతం ఎలుకలు గాయాలు చేసినట్లు తెలుస్తోంది. అందులో ముజీబ్ అపస్మారక స్థితిలో ఉండడం, ఆయనతో వచ్చిన పేషంట్ కేర్‌టేకర్‌లు నిద్రపోవడంతో ఎలుకలు దాడిచేసి రక్తస్రావానికి కారణమవుతున్నా గుర్తించేవారే కరువయ్యారు. కొద్దిసేపటి తర్వాత కేర్‌టేకర్‌లు చూసి ఎలుకలను అక్కడి నుంచి తరిమివేసి సిబ్బందికి తెలుపడంతో ఆయనకు ప్రథమ చికిత్స నిర్వహించారు. అయితే గతంలో ట్రామాకేర్‌లో సైతం ఇదే తరహాలో ఎలుకలు స్వైర విహారం చేస్తు రోగులను గాయపరిచిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఆ తర్వాత ఎలుకలు రాకుండా కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయడం, భవనంలో ఆయా చోట్ల ఉన్న రంధ్రాలను మూసివేయడం లాంటివి చేశారు. ఆయా విభాగాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సైతం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ఇటీవల పై అంతస్తులో నిర్మాణాలు చేసే సమయంలో ఐసీయూలో సిలింగ్ పైన చిన్నపాటి గుంత ఏర్పడింది. దాని పూర్తి స్థాయిలో మూసివేయకుండా అట్టముక్కలు అడ్డుపెట్టడంతో ఆ రంధ్రం గుండా ఎలుకలు వచ్చి ఐసీయూలోని పేషంట్లను గాయపరుస్తున్నాయని పేషంట్‌కేర్ టేకర్‌లు పేర్కొంటున్నారు.

పేషంట్‌కేర్ టేకర్‌లు భోజనం చేయడానికి స్థలం కరువు

రోగాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు వస్తున్న పేషంట్లను వైద్యులు పరీక్షించి ఇన్‌పేషంట్‌గా అడ్మిన్ చేస్తున్నారు. రోగులకు సేవలు చేసేందుకు వారి కుటుంబీకుల్లో ఒకరిద్దరు పేషంట్ కేర్ టేకర్‌లుగా అక్కడే ఉంటున్నారు. వారు తినేందుకు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకుని వస్తూ ఆయా విభాగాల పరిసరాల్లోనే తింటూ మిగిలిన భోజనాన్ని లేదంటే వ్యర్థాలను ఆసుపత్రి బాల్కనీలో లేదంటే అక్కడే ఉన్న పరిసరాలలో విచ్చలవిడిగా పారేస్తుండడంతో ఎలుకలు ఆ వ్యర్థాలు తినేందుకు వచ్చి అక్కడే తిరుగుతుండడం లేదంటే ఆయా విభాగాలలో పేషంట్ల వద్ద ఉండే ఆహారపదార్థాల కోసం వచ్చి వాటిని ఎత్తుకెళ్తుండడం చేస్తూ రాత్రి సమయంలో నిద్రిస్తున్న పేషంట్లపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. అయితే గతంలో పేషంట్ కేర్‌టేకర్‌లకు ప్రత్యేకంగా ఓ హాల్ ఉండేది. అక్కడే అందరు కేర్ టేకర్‌లు భోజనం చేసి పేషంట్ల వద్దకు వచ్చేవారు. ప్రస్తుతం ఆ స్థలం కోవిడ్ టెస్ట్‌లకు సంబంధించిన ల్యాబ్‌ను ఏర్పాటు చేయడంతో పేషంట్ కేర్‌టేకర్‌లు ఆయా విభాగాల వద్దనే భోజనం చేసే అక్కడే వ్యర్థాలు వేస్తూ ఎలుకల సంచారానికి కారణమవుతున్నారనే వాదనలు ఆసుపత్రి సిబ్బంది నుంచి వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో భోజనం చేయడానికి ప్రత్యేకంగా స్థలాన్ని ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

చికిత్స పొందేందుకు జంకుతున్న ప్రజలు

గతంలో ఏరియా ఆసుపత్రిగా ఉండి ఆ తర్వాత జిల్లా కేంద్ర ఆసుపత్రిగా మారింది. ప్రస్తుతం మరిన్ని పడకల పెంపుతో పాటు నిపుణులైన వైద్యబృందం వస్తుండడంతో మరిన్ని సేవలు అందే అవకాశం ఉందని ప్రైవేట్ ఆసుపత్రులను కాదనుకుని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న ప్రజలకు పలు సందర్భాల్లో చోటు చేసుకుంటున్న అపాయాలతో చికిత్స పొందేందుకు జంకుతున్నారు. గతంలో ట్రామాకేర్‌లో పలువురిని ఎలుకలు గాయపరచడం, ఆ తర్వాత పై అంతస్తులో నిర్మాణం చేస్తున్న సమయంలో గోడ ఒక్కసారిగా కూలిపోవడం, ఐసీయూలోపై నుంచి పైపు వచ్చి కిందపడిన సంఘటనలు ఉండడం, ప్రస్తుతం ఐసీయూలోని ఆ దారి గుండానే ఎలుకలు వచ్చి రోగులను గాయపరచడంతో ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కంటే ఆసుపత్రిలోని సమస్యల వలయంతోనే భయభ్రాంతులకు గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలను నివారించాలి

- ఎలుకల దాడిలో గాయపడిన ముజీబ్‌ను పరామర్శించిన బర్రెలక్క



ముజీబ్‌ను పరామర్శిస్తున్న బర్రెలక్క

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ముజీబ్ అనే వ్యక్తిని శనివారం రాత్రి ఎలుకలు గాయపర్చడంతో ఆయనను పరామర్శించేందుకు సోషల్ మీడియా ఫేం బర్రెలక్క అలియాస్ శిరీష ప్రభుత్వ ఆసుపత్రికి ఆదివారం వచ్చారు. ముజీబ్‌కు అపస్మారక స్థితిలో ఉండడంతో ఆయన కుటుంబీకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మిని కలిసి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఎలుకలను నివారించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలోనూ పలు ఘటనలు ఈ ఆసుపత్రిలో చోటు చేసుకున్నాయని ప్రజలు పేర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఇద్దరు వైద్యులు, ఒక నర్సు సస్పెన్షన్

- ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సరెండర్ చేస్తూ ఆదేశాలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రాత్రి ముజీబ్ అనే వ్యక్తిని ఎలుకలు కరిచి గాయాలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఆదివారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను పరిశీలనకు పంపడంతో పాటు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను వివరణ కోరింది. దీంతో వారు ఇచ్చిన ప్రాథమిక విచారణ రిపోర్టు ఆధారంగా ఆసుపత్రిలోని ఐసీయూ ఇన్‌చార్జ్ డాక్టర్ కావ్య, ఇన్‌చార్జ్ జనరల్ మెడిసిన్ డాక్టర్ వసంత, స్టాఫ్‌నర్సు మంజూలను సస్పెండ్ చేస్తూ డీఎంఈ అధికారిని త్రివేణి ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మిని విచారణ పూర్తయ్యే వరకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు సరెండర్ చేస్తు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ తల్లిదండ్రుల ధర్నా



బీబీపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బీబీపేట, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర హాస్టల్‌లో 400 మంది విద్యార్థులు ఉన్న వారికి సరైన భోజనం, వసతి కల్పించడం లేదని ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీనెల రెండో ఆదివారం ఔట్ ఉంటుందని తమ పిల్లలను కలిసి మాట్లాడానికి వస్తే ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తల్లిదండ్రులతో అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని తెలిపారు. కనీసం మహిళలు అనే గౌరవం లేకుండా దుర్భాషలాడుతున్నారని అన్నారు. తమ ముందు తమ పిల్లలను తిట్టడం, కొట్టడం చేస్తూ వారిని చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. 400 మంది విద్యార్థులు ఉన్నా సరైన సొంత భవనం, క్రీడా స్థలం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 400 మంది విద్యార్థులకు కేవలం 20 బాత్‌రూంలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. పాఠశాల హాస్టల్ ఒకే భవనంలో ఉండడంతో విద్యార్థులకు పడుకోవడానికి సరైన స్థలం లేదని తెలిపారు. రోడ్డుపైన బైఠాయించిన తల్లిదండ్రులను పోలీసులు సముదాయించి అక్కడ నుంచి తరలించారు. అనంతరం తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కుక్కల బెడద తీరేదెన్నడో?

- జిల్లాలో వృద్ధులు, చిన్నారులను గాయపరుస్తున్న శునకాలు
- ఇటీవల వీధి కుక్కల దాడిలో మృతి చెందిన వృద్ధురాలు
- రోడ్ల మీద ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- పూర్తి స్థాయిలో నియంత్రణ చేపట్టని అధికారులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11: జిల్లాలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లమీద ప్రయాణించాలంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాలు, గ్రామాల్లో కుక్కల సంతతి పెరిగింది. గతంలో ఆయా మున్సిపాలిటీల పరిధిలో కుక్కలను బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడం లాంటివి చేసిన ప్రస్తుతం ఆ తరహ చర్యలు కనిపించడం లేదు. కుక్కలను చంపకుండా వాటి సంతతిని పెరగకుండా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని సైతం ఎక్కడ అమలు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామానికి చెందిన ముస్తాబాద్ రామవ్వ అనే వృద్ధురాలిపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కామారెడ్డి పట్టణంలో గత నెలరోజుల క్రితం ఇద్దరు చిన్నారులపై దాడి చేయడంతో వారు ఆసుపత్రిలో చికిత్స పొందారు. గతంలో బిచ్కుంద, బీర్కూర్, మద్నూర్ తదితర మండలాల్లో అనేక మందిని కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఇదే తరహాలో జిల్లాలోని ఆయా ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో పదుల సంఖ్యలో బాధితులు చికిత్సలు తీసుకుంటున్న వాటి నియంత్రణకు మాత్రం చర్యలు కరువయ్యాయి.



కామారెడ్డిలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కామారెడ్డి పట్టణంలో మళ్లీ పెరిగిన సంతతి

కామారెడ్డి పట్టణంలో వీధి కుక్కల సంతతి రోజురోజుకూ అధికమవుతుంది. గతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటే మున్సిపల్ పాలకవర్గం నిర్ణయం మేరకు కుక్కలను పట్టణంలో లేకుండా చేసి వాటిని మరో ప్రాంతానికి తరలించారు. ప్రస్తుతం ఆయా వార్డులో కుక్కల బెడద ఎక్కువ అవడంతో ప్రజలు రోడ్లవెంట ప్రయాణించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. పట్టణంలోని ముదాంగల్లి, హరిజనవాడ, గొల్లవాడ, కాకతీయనగర్, శ్రీరాంనగర్, ఎన్‌జీవోస్ కాలనీ, అశోక్‌నగర్ లాంటి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్సలు పొందిన సందర్భాలున్నాయి. ఇందులో ఎక్కువగా వృద్ధులు, చిన్నారులే ఉన్నారు. కుక్కలను చంపవద్దని అధికారులు చెబుతున్న వాటి సంతానం వృద్ధి చెందకుండా పశువైద్యశాఖ, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కుక్కల భయానికి ఇంటి నుంచి చిన్నారులను బయటకు పంపలేక, కర్ర సహాయంతో తప్ప బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు.



కుక్కల దాడిలో మృతి చెందిన రాజవ్వ

వృద్ధులు, చిన్నారులను వెంటాడుతూ గాయపరుస్తున్న వైనం

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతునే ఉంది. ఆరుబయటకు ఆడుకోవడానికి వచ్చిన చిన్నారులను, దుకాణాలకు తినుబండరాల కోసం వెళ్తున్న వారిని వెంటాడి గాయపరుస్తున్నాయి. మాచారెడ్డి మండలంలో ఇంటి ముందు కూర్చున్న వృద్ధురాలిపై దాడి చేయడమే కాకుండా శరీరమంతా ఛిద్రం అయ్యేలా కరిచి గాయపరిచాయి. దీంతో సదరు వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అదేవిధంగా గతంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో ఆరుబయట ఆడుకుంటున్న చిన్నారులను కిందపడేసి తలపై కరువడంతో తీవ్ర రక్తస్రావమై నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే ప్రాంతంలో మరో చిన్నారిని సైతం ఇదే తరహాలో దాడి చేయడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు దోమకొండ, సదాశివనగర్, గాంధారి, రామారెడ్డి తదితర మండలాల నుంచి వారంలో కనీసం ఇద్దరు చొప్పున కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఇప్పటికైన పశు సంవర్ధకశాఖ, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో కుక్కల బెడదపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సమస్యలు తీర్చడం కోసమే ఫిర్యాదుల పెట్టెలు



పెద్దమల్లారెడ్డిలో ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్/భిక్కనూరు/దోమకొండ/రాజంపేట, ఫిబ్రవరి 11: కామారెడ్డి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గ్రామగ్రామాన ఏర్పాటు చేస్తున్న ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేస్తున్నట్టు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, రాజంపేట మండలాల్లో ఆదివారం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. కామారెడ్డి పట్టణంలోని రైల్వేకమాన్ వద్ద, భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో బస్టాండ్ వద్ద, దోమకొండ మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో, రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామంలో ఆదివారం ఫిర్యాదుల పెట్టెను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీర్చడం కోసమే ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఏ సమస్య ఉన్నా కాగితంపై రాసి పెట్టెలో వేస్తే వారంలోగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాను అందుబాటులో ఉన్నా లేకున్నా ప్రజలకు ఇబ్బందులు పడవద్దని ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పని చేయాలి'



డొంకేశ్వర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

డొంకేశ్వర్, ఫిబ్రవరి 11: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 50వేల మెజారిటీ వచ్చే విధంగా ప్రతీఒక్క బీజేపీ కార్యకర్త పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో యాదవ సంఘంలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ నా గెలుపు బీజేపీ కార్యకర్తల గెలుపు అని బీజేపీలో కార్యకర్తలు డబ్బుకు లొంగని నిబద్ధతో పని చేశారని కొనియాడారు. ప్రతీఒక్క కార్యకర్త నియోజకవర్గంలో ఏళ్ల పాటు జెండా మోస్తూ పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, ఎంపీటీసీలు సంజీవ్, సుగుణ, చిన్నారెడ్డి, గంగాదేవి, మహేష్, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో మార్కండేయ కండువాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

భక్త మార్కండేయ కండువాల పంపిణీ

ముప్కాల్, ఫిబ్రవరి 11: బాల్కొండ భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని బాల్కొండ మండల కేంద్రంలోని మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్త మార్కండేయ కండువాను గ్రామ పద్మశాలీ సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల పద్మశాలి అధ్యక్షుడు మానేటి నాగభూషణం మాట్లాడుతూ పద్మశాలి సంఘం సభ్యులు అందరు సంఘటితం ఏర్పడి రాజకీయంగా సామాజికంగా ప్రతి సభ్యుడు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మార్కండేయ జయంతి సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలో శ్రీమార్కండేయ మందిరంలో పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మానేటి నాగభూషణం, కార్యదర్శి రాజుల రామానాథం, బాల్కొండ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఏలిగేటి మధుకర్, కోశాధికారి రాజేందర్, సంయుక్త కార్యదర్శి తమ్మే కపిల్, సంఘ సభ్యులు నవీన్, సుమన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి 11: కన్నుల పండుగగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన గావించారు. మున్నూరుకాపు సంఘాలైన గంగరపు సంఘం, పురస్తు సంఘం, తోట సంఘం ఆధ్వర్యంలో భీమ్‌గల్ శివారులో నెలకొని ఉన్న పోచమ్మతల్లి గుడిలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఉదయం 9గంటల నుంచి పట్టణంలోని సార్గమ్మ, పెద్ద పోచమ్మ తల్లులకు నైవేద్యాలు సమర్పించారు. మహిళలు మంగళహారతులతో ముందుకు సాగారు. కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.

రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

ముప్కాల్, ఫిబ్రవరి 11: బాల్కొండ మండల కేంద్రంలోని వేవ్ యాడ్ వద్ద సీసీరోడ్డు నిర్మాణం కోసం జిల్లా కోఆప్షన్‌సభ్యుడు మోహీజ్ తన జడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షల ప్రొసిడింగ్ కాపీ ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాహబ్, మైనారిటీ నాయకులు ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట్‌లో మెగా వైద్యశిబిరం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని నారాయణపేట్ గ్రామంలో ఆర్మూర్ సిరి నర్సింగ్‌హోం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నారాయణపేట్, లక్ష్మాపూర్ గ్రామాల ప్రజలకు డాక్టర్ లింగారెడ్డి ఉచిత వైద్యపరీక్షలు చేశారు. ఈ రెండు గ్రామాల ప్రజలు సుమారు 600మంది ఈ శిబిరానికి రాగా డాక్టర్ లింగారెడ్డి, ఇతర వైద్యాధికారులు పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ, ఈజీసీ, డీఎండీ, మోకాళ్ల నొప్పులు, ఇతర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరి ఆసుపత్రి డాక్టర్ లింగారెడ్డితో పాటు ముత్యంరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సిరికొండ ఫిబ్రవరి 11: వ్యవసాయ పంపుసెట్టు రన్ కావడం లేదని తెలిసిన మరుక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌పై గల ఎస్‌జీపీఎస్ వైరు వేద్దామని వెళ్లిన రైతుకు కరెంటు షాకు తగిలి అక్కడికక్కడే మరణించిన సంఘటన సిరికొండలో ఆదివారం ఉదయం జరిగింది. గ్రామస్థులు, ఎస్సై రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రానికి చెందిన కంచెట్టి బాబురావు(48) అనే రైతు ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వ్యవసాయ పంపుసెట్టును పరిశీలించగా మోటరు నడువడం లేదని గ్రహించారు. వెనువెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు పరిశీలించగా ఎస్‌జీపీస్ వైరుపోయిందని గ్రహించాడు.ఏబీ స్విచ్ ఆఫ్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ గద్దెపైకి ఎక్కి ఎస్‌జీపీస్ వైరు వేస్తుండగా కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. భార్య కంచెట్టి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రమేష్ కేసు నమోదు చేసుకుని శవ పంచనామా చేశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బాబురావుకు బార్య, ఇద్దరు కూతుళ్లు, తల్లి, చెల్లి, అన్నా ఉన్నారు. బాబురావుకు దీనికి సంబంధంచి వివరాలు అడిగితే ఏబీ స్విచ్ ఆఫ్ చేసినప్పుడు రెండు లైన్లకు సంబంధించి ఆఫ్ కాగా, మూడోది ఆన్‌లో ఉండవచ్చని అంటున్నారు. మూడోది విడిపోకుండా వైరుతో కట్టివేసి ఉండవచ్చని తెలిపారు. ఏబీస్విచ్ ఆఫ్ చేయగానే మూడు లైన్లకు సంబంధించిన లైన్లు విడిపోవాలని, బాబురావుకు విద్యుత్ షాక్ రావడానికి మూడోది విడిపోకపోవడమే కావచ్చుని వివరించారు. విద్యుదాఘాతంతో రైతు మృతి చెందడం అందరినీ కలిచి వేసింది. ఇప్పటికైన ట్రాన్స్‌కో సిబ్బంది ఏబీ స్విచ్‌ను పరిశీలించి సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి సేవా సదన్ వార్షికోత్సవం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 11: బోధన్ పట్టణంలోని సత్యసాయి సేవా సదన్ 32వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వ హించారు. ఇందులో భాగంగా సదన్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమం, నగర సంకీర్తన, మధ్యాహ్నం సంగీత విభావరి కార్యక్ర మాలు జరిపించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహిం చిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం మహా హారతి,అన్నప్రసాదం వితరణ చేసి కార్యక్రమాలు ముగించారు. ఈకార్యక్రమాల్లో సత్యసాయి సేవాసదన్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జిల్లా కన్వీనర్‌శ్రీనివాస్,మహిళా కన్వీనర్ నాగమణి, గ్రామసేవా ఇన్‌చార్జి ప్రవీణ్, ప్రతినిధులు లక్ష్మీకాంత్‌రెడ్డి, బండారుముత్తెన్న, సూర్య కుమారితో పాటు సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం


మెండోరలో స్వామివారి ఉత్సవాల్లో గోవిందస్వాములు

మెండోర, ఫిబ్రవరి11 మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి పదోవార్షికోత్సవ ఉత్సవాలు ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోవిందాస్వాములు వేకువజామున స్వామివారి మేలుకోలుపులో పాల్గొని గోవింద నామాలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మూడు రోజులుగా జరిగే ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు వేంకటేశ్వరస్వామి వారి గోవింద నామాలు ప్రతిష్ఠాపన ఉంటోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్మూర్‌లో ఇసుక లారీ సీజ్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి11: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 63వ జాతీయరహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని జిల్లా మైనింగ్ అధికారి టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వర్ పట్టుకొని సీజ్ చేశారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన లారీని ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో పార్క్ చేయించినట్టు తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులను పోలీసులకు అప్పగింత

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి11:పట్టణంలోని శాస్త్రీనగర్‌లో అనుమానా స్పందంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను కాలనీవాసులు పోలీసులకు అప్పగించారు. కాలనీలో ముగ్గురు పిల్లలు ఆడుకుంటున్న సమయంలో బాన్సువాడకు చెందిన శివకృష్ణ, పోతంగల్‌కు చెందిన రమేష్‌లు తాగిన మైకంలో పిల్లల వద్దకు వెళ్ళడంతో వారి కేకలు వేయగా కాలనీవాసులు కిడ్నాపర్‌లుగా భావించి ఇద్దరిని వివరాలు అడగగా సరియైన సమాధానం రాక పోవడంతో దేహశుద్ధి చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో శ్రీధర్‌రెడ్డి మాట్లాడు తూ ఎవరిపైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ఏర్గట్ల, ఫిబ్రవరి 11: మండలంలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. బట్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు మూడ్ గంగారాం, మాజీ సర్పంచ్ గుల్లె లావణ్య భర్త గుల్లె గంగాధర్ కుటుంబ సభ్యులతో పాటు సోమ లింగారెడ్డి, నేరెళ్ల లింగారెడ్డి కుటుంబ సభ్యులను వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీగుల్లెరాజేశ్వర్, బీఆర్‌ఎస్‌మండలాధ్యక్షుడు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 11:మండంలోని చాంద్రాయన్‌పల్లి గ్రామంలో ఆదివారం ముది రాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా పెద్దమ్మ ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం బోనాలు ఊరెగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో ముది రాజ్ గ్రామ పెద్దలు నరేష్, రఘు, పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవీపేట,ఫిబ్రవరి11: నవీపేట మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులు

● 11సార్లు వంద శాతం లక్ష్యంతో ముందుకు సాగి ● ఉపాధ్యాయుల పకడ్బందీగా ప్రణాళిక


డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

డొంకేశ్వర్, ఫిబ్రవరి11: విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదోతరగతిలోనే ప్రారంభమవుతోంది. విద్యార్థులు మొదటిసారి రాసే పబ్లిక్ పరీక్షల్లో సాధించే ఉత్తమ గ్రేడ్‌లో భవిష్యత్‌కు పునాది.ప్రణాళిక అమలులో భాగంగా పాఠ్యాంశాలు పూర్తి చేశారు. మంచి ఫలితాలు సాధించే లక్ష్యంగా ఉపాధ్యాయులు రోజు ఉదయం, సాయంత్రం వేళలో తరగతులు నిర్వహిస్తున్నారు.మెరుగైన ఫలితాలు రాబట్టాలనే తపనతో విద్యార్థులు పుస్తకాలతో పోటీపడుతు న్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఏడాది 82మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. గత డిసెంబరులో పాఠాలుపూర్తి చేసిన ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30నుంచి 9.30, సాయంత్రం 4.45 నుంచి 5.45వరకు ప్రత్యేక తరగతులు నిర్వ హిస్తున్నారు.ప్రతీరోజు ఒకసబ్జెక్టుపై పరీక్ష ఏర్పా టు చేస్తున్నారు.విద్యార్థులను వారి ప్రతిభ ఆధారంగా విభజించి వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

● పదేళ్లుగా వంద శాతం ఉత్తీర్ణత

డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రతీఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. 2023 సంవత్సరం వరకు వంద శాతం ఉత్తీర్ణత సాధించింది.ఈఏడాది కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు,ప్రధానోపా ధ్యాయులు ప్రత్యేకంగా కష్టపడుతున్నారు.ఈ సారి ఎలాగైనా మంచి గ్రేడ్‌సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు పుస్తకాలతో పోటీపడుతు న్నారు.

● సబ్జెక్టుల వారీగా అవగాహన

తెలుగుబాషపై పద్యాలు, సాహిత్యపఠనం ద్వారా పాఠాలను బోధిస్తున్నారు. హిందీబాషపైఅక్షర దోషాలు లేకుండా రాయడం వ్యాకరణపై పట్టు కలిగించేలా నేర్పిస్తున్నారు. ఇంగ్లీష్ బాషపై ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులను నిర్వహిస్తున్నారు. వచ్చే సంవత్సరం నుంచి ప్రతీ క్లాసుకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతిని నిర్వహిస్తున్నారు. గణితశాస్త్రం పైమేళకువలపై తరగతులకు అవసరమయ్యే సుత్రాలను హెచ్‌ఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులకు నేర్పిసు న్నారు. సామాన్యశాస్త్రంపై ప్రయోగాత్మకంగా బోధనసైన్స్ సెమినార్ ద్వారా బోధిస్తున్నారు. సాంఘికశాస్త్రంపై రాజ్యాంగం పట్ల అవగాహన ఓటు యొక్క విలువ విద్యార్థులకు తెలిసి విధంగా మాక్ పోలింగ్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూ చారి త్రాత్మక ప్రదేశాలకు అజంతా ఎల్లోరా వంటి ప్రదేశాలకు విద్యార్థులతో సందర్శించారు.

ప్రతీ ఏటా బాసర త్రిబుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

గత పది సంవత్సరాలుగా బాసర త్రిబుల్ ఐటికి ఐదు నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపిక అవుతున్నారు. గత సంవత్సరం ఆరుగురు విద్యార్థులు త్రిబుల్‌ఐటికి ఎంపికయ్యారు. హైబ్రిడ్ స్టవ్ సైన్స్ ఎక్స్‌పర్‌మెంట్‌లో రాష్ట్రస్థా యిలో జరిగిన పోటీలో మొదటి స్థానంలో సా ధించి జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక య్యారు.

ఉత్తమఫలితాల సాధనకు కృషి

విద్యార్థులు పదవ తరగతి ఎంతో కీలకం ఇక్కడ నుంచి గ్రేడ్ సాధిస్తే భవిష్యత్‌కు బంగారు బాటలు పడతాయి. అందుకు పక్కా ప్రణాళిక రచించుకొని ముందకు సాగుతున్నాం. ఈ ఏడాది వంద శాతం ఫలితాలు రావడం కోసం విద్యార్థులు సన్నద్ధం చేస్తున్నాం. సంబంధిత ఉపాధ్యా యుల ద్వారా విద్యార్థులకు వారి సందేహా లను నివృత్తి చేసుకుంటున్నారు. ఉత్తమ గ్రేడ్ సాధించేలా విద్యార్థులను ప్రోత్సహి స్తున్నాం. ప్రత్యేక తరగతులపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం.

- సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలను మరువొద్దు

● పాఠశాలల అభ్యున్నతికి చేయూతనందించాలి ●కోటగిరిలో 1974-2000 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోటగిరి,ఫిబ్రవరి11: పుట్టిన ఊరు, భవిష్యత్తుకు బాటలు వేసిన పాఠశాలను మరిచిపోవద్దని, భావి తరాలకు ఆదర్శంగా నిలిచేందుకు ప్రతి ఒక్కరు పాఠశాలకు, గ్రామానికి తమవంతు చేయూతనందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1974-2000 సంవత్సరం వరకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం-2 స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటగిరి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుమారు 400మందికి పైగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. తమకు విద్య నేర్పిన గురువులను ఆప్యాయంగా పలకరించి వారికి ఘన సన్మానం చేశారు. 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు తమతమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కిడ్స్ ఆధ్వర్యంలో పాఠశాలలో చదివిన ప్రతి పూర్వ విద్యార్థికి ఘన సన్మానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఎన్నో రంగాలలో స్థిరపడి తాము చదివిన పాఠశాలకు ఒక్క పిలుపుతో చేయూతనందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని పేర్కొన్నారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలలో తలపెట్టిన కార్యక్రమం వివిధ రాష్ట్రాలలో, వివిధ రంగాలలో స్థిరపడిన విద్యార్థులందరు ఒకే చోటుకు చేరుకోవడం గ్రామంలో పండుగ వాతావరణాన్ని కల్పించింది. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ప్రసాద్ రావు, శ్రీరాములు, రవి కిరణ్, ప్రభాకర్ రావు, కిడ్స్ అధ్యక్షులు వీరేశం, గంగాధర్ గౌడ్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, ప్రముఖ వ్యాపారవేత్త రాజశేఖర్, కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్‌కుమార్ చౌదరి, రిటైర్డ్ ఎమ్మార్వోసాయిలు తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నాటి విద్యార్థులు

నాగాపూర్‌లో గ్రామ దేవతలకు బోనాలు

కమ్మర్‌పల్లి ఫిబ్రవరి 11: మండలంలోని కమ్మర్‌పల్లి నాగాపూర్ గ్రా మాలతో పాటు మండలం లోని పలు గ్రామాలలో ఆదివారం ఆయా గ్రా మాల మహిళ భక్త జనం పోచమ్మ ఆలయాలకు పోటెత్తారు. గ్రామాలలోని పోచమ్మ ఆలయాలవద్ద బారులతీరి చలిబోనాలు సమర్పించుకున్నారు.అమ్మవారికి బోనాలు సమర్పించుకోవడానికి మహిళలు ఆదివారం వేకువజాము 4గంటల నుండే పోచమ్మ తదితర గ్రామరక్షక దేవతల ఆలయాలముందు బారులుతీరి చలిబోనాలు సమర్పించుకున్నారు. పుష్య మాసం అమావాస్య త దుపరివచ్చే ఆది వారం గ్రామరక్షకదేవతలకు బో నాలు సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమని గ్రామస్థులు, మహిళలన్నారు. మండలంలోని ఆయాగ్రామాల మహిళలు గ్రామ రక్షణనార్థం ప్రతిష్టించుకున్న గ్రామదేవతలకు అత్యంత భక్తి శ్రద్ధలతో చలిబోనాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో గ్రామ శివారుల్లో ఉన్న గ్రామదేవతలు పోచమ్మ,మైశమ్మ,ఐదుజేతులపోచమ్మ, నల్లపోచమ్మ,పెద్దమ్మఆలయాలకు తరలివచ్చి బోనాలు సమర్పించుకున్నారు.ఈసందర్భంగా అందరికి అంతా మంచి జరగాలని అమ్మవారలను కోరుకుంటూ నైవే ద్యాలు సమర్పించుకున్నట్లు మహిళలు తెలిపారు.


పోచమ్మకు చలిబోనాలు సమర్పించుకుంటున్న మహిళలు

అంతుచిక్కని వరి పంట..ఆందోళనలో రైతులు

● పంట ఎదుగుదలకు రైతుల పడరాని పాట్లు ● పంటకు మందుల పిచికారీ చేసినా కోలుకోని పంట


నాటి 40 రోజులైనా కోలుకోని వరి పంట


నారుమడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణీ భాగ్యలక్ష్మీ(ఫైల్)

దోమకొండ, ఫిబ్రవరి 11:ఈ యెడు రైతులు ఎప్పటిలాగే దుక్కులు దున్ని వరి నారు సిద్ధం చేసుకుని పంటలు సాగు చేసేందుకు ఎంతో ఆశతో ముందుకు సాగారు. అయితే వరి నారు అలికిన నాటి నుంచి రైతులు మందుల పిచీకారి చేయుటకే బీజీగా ఉంటున్నారు. డిసెంబరు నెలలో నారు పోసిన రైతులు డిసెంబరు చివరి వారం నుంచే వరి నాటు వేసేందుకు దమ్ము చేసి నాట్లు వేశారు. అయితే వరి నాట్లు వేసి 35 నుంచి 40 రోజులైనప్పటికి కొన్ని చోట్ల వరి కోలుకొవడం లేదని రైతులు చెపుతున్నారు. నాటు వేసినప్పటి నుంచి మందులు చల్లిన ఫలితం రావడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నాట్లు వేసిన నుంచి చివరి వరకు ఎకరాన రూ. 10వేల వరకు ఖర్చులు అయ్యేవని కానీ నాట్లు వేసి 40 రోజులు గడవకముందే మందులు స్ప్రే చేయడం వలన ఎక్కువ పెట్టుబడి పెట్టడం జరిగిందని అయినప్పటికి వరి పంట పచ్చపడటం లేదని రైతులు తెలుపుతున్నారు. యూరియాతో పాటు తెగుళ్ల మందులు, గంట మందులు, పురుగు మందులు, పొలం పచ్చపడేందుకు ఫౌడర్‌తో పాటు ఇతర మందులు చల్లిన పంటలు ఎదగవలసిన స్థాయికి ఎదగకుండా ఉండటంతో ఏమి చేయాలో రైతులకు అంతు చిక్కడం లేదు. కొంత మంది రైతులు నారు మడ్లు కోలుకొకపోవడంతో దున్నేసి మళ్లీ నాట్లు వేసిన సంఘటనలు మండలంలో చాలానే ఉన్నాయి. వ్యవసాయాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పంటల ఎదుగుదలకు చేపట్టవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

మొగిపురుగు నివారణకు పోటాష్ ఉన్న ఎరువులు పిచికారి చేయాలి



మొగిపురుగు యాసంగి వరి పైరుపై ఎక్కువగా ఆశిస్తుంది. ఆశించడం వలన వరి నారు మడి పూర్తిగా తింటుంది. అందువలన వరి కర్రలు ఎదుగుదల ఉండదు. దాని నివారణకు కార్టప్‌హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఏకారానికి లేదా క్లోరంన్‌టో ఫ్లానిక్ 60 మీల్లిలీటర్లు, అలాగే పొలం ఎదుగుదలకు జింక్ లోపం ఉండటం వలన దీన్ని నివారణకు జింక్‌అఫ్టేడ్ 39శాతం 200 ఎం. ఎల్ 8 పంపులు చేసి ఎకరానికి మందు పిచీకారి చేయాలి.రోగనిరోదక శక్తికి పోటాష్ ఉన్న ఎరువు 13.0 24, 2 కేజీలు ఎకరానికి పిచీకారి చేయాలి. ఎక్కువ మోతాదులో మొగి పురుగు సోకినపుడు వ్యవసాయాశాఖ అధికారులను సంప్రదించాలి.

- భాగ్యలక్ష్మీ, జిల్లా వ్యవసాయాధికారిణీ

పంట మార్పిడి తప్పనిసరి

పురుగు నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే మొవ్వులు ఎండి చనిపోతాయి. అంకురం నుంచి చిరు పోట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి.వ్యవసాయశాఖ అధికారులు, ఏఈవోలు అందుబాటులో ఉంటారు. తప్పని సరిగా వారి సలహాలతోనే మందులు పిచీకారి చేసి తర్వాత ఆ మడిలోనే ఇంకేటట్లు చేయాలి. పంటల మార్పిడి తప్పనిసరి చేయాలి. లేదంటే నేల సోడ్‌గా మారడానికి అవకాశం ఉంటుంది.రైతులు పంటల మార్పిడికి ప్రణాళికలను తయారు చేసుకోవడం వలన అధిక దిగుబడులు పోందవచ్చు.

-ఏవో పవన్ కుమార్, మండల వ్యవసాయాధికారి

వాసవి కన్యకా పరమేశ్వరికి వైశ్యుల పూజలు

లింగంపేట, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్యులు తమ కుల దేవత వాసవి కన్యకాపరమేశ్వరి అగ్ని గుండంలో దూకి ఆహుతి చేసుకున్న సందర్భంగా ఆమెకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యసంఘం అధ్యక్షుడు చింతల వేణు మాట్లాడుతూ.. వాసవి మాత పార్వతి దేవి అంశగా చెప్పుకుని, పార్వతి తనకు జరిగిన అవమానానికి మంటల్లో దూకినట్లుగానే వాసవి తన వంశం కోసం అగ్నిలోకి దూకి ఆత్మహత్య చేసుకుని విష్ణువర్ధనుని నుంచి తనను తాను కాపాడుకుని తన వంశాన్ని కాపాడిందని ఆయన అన్నారు. ఆమె జీవిత చరిత్ర అహింసను నమ్మినందుకు, మత విశ్వాసాన్ని నిలిపినందుకు, స్త్రీల ఆత్మ గౌరవాన్ని కాపాడినందుకు శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోయిందని ఆయన తెలిపారు. వైశ్యుల కీర్తిని విశ్వవ్యాప్తంగా వ్యాపింప చేసిన ఆమె ఎప్పటికి అజరామరం అయ్యిందని ఆయన తెలియజేశారు. ప్రాపంచిక సుఖాలను విస్మరించిన ఆమె వైశ్యుల మనసులలో ఒక విజేతగా, శాంతికి చిహ్నంగా ఎప్పటికి నిలిచిపోతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జక్సాని రవి, పార్శ ప్రభాకర్, కొత్త దుర్గయ్య, చింతల రమేష్, శ్రీహరి, దత్తురాంలు, తాటిపాముల శ్రావణ్, కాటిపల్లి శ్రీధర్, నాగరాజులతో పాటు ఆర్యవైశ్యులు ఉన్నారు.



వాసవీ మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బీర్కూర్‌లో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

బీర్కూర్: ఆర్యవైశ్య కులదేవత వాసవి కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్యులు ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలో అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమ్మవారి జీవిత చరిత్ర పారాయణం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.



లింగంపేటలో వాసవిమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 11: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో మూడు రోజులుగా అల్లమా ప్రభు జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుస్తీ పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కుస్తీ పోటీలలో గెలుపొందిన విజేతకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.2101 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అన్నం సత్యనారాయణ, ఎంపీపీ విఠ్ల విఠల్, ఎంపీటీసీ మామిళ్ళ నారాయణరెడ్డి, నసురుల్లాబాద్ సొసైటీ చైర్మన్ కొప్పుల గంగారాం, మండల గౌడ సంఘం పవన్‌గౌడ్, వెంకన్నచారి, ఎస్‌ఐ లావణ్య, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



కుస్తీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ధర్మారెడ్డిలో వినియోగదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఉచిత విద్యుత్ పథకం కోసం వివరాల సేకరణ

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 11: మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో ఉచిత విద్యుత్ పథకం అమలు కోసం ఆదివారం విద్యుత్ అధికారులు ఇంటింటికీ తిరిగి విద్యుత్ వినియోగదారుల నుంచి వివరాలు సేకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీ స్కీంల అమలులో భాగంగా గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించనుండటంతో ఈ పథకం అమలుకు గాను గ్రామంలో ఇంటింటి కార్యక్రమం చేపట్టి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, లైన్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, లైన్‌మెన్ మన్సూర్, సొసైటీ డైరెక్టర్ జయరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

కాంగ్రెస్‌లో చేరిన ఆలయ కమిటీ చైర్మన్

భిక్కనూరు, ఫిబ్రవరి 11: మండలంలోని తిప్పాపూర్ గ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్ధరాములు ఆదివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సిద్ధరాములుకు షబ్బీర్ అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై చాలా మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీలోని ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



షెడ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

భక్తుల షెడ్ నిర్మాణానికి భూమిపూజ

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 11 : కాకతీయుల నాటి కాలంలో నిర్మించబడిన మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రిలింగ రామేశ్వర దేవాలయం ఆవరణలో భక్తులకు వసతి సౌకర్యంగా నూతన షెడ్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ పురాతన ఆలయం వద్ద భక్తులకు వసతి సౌకర్యం లేక దూర ప్రాంతాల నుంచి ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతుంటారు. దీంతో మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన ఏలేటి సురేష్‌రెడ్డి ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కోసం షెడ్ నిర్మించేందుకు ముందుకొచ్చారు. షెడ్ నిర్మాణం కోసం ఆలయ ఆవరణలో ఆదివారం భూమిపూజ నిర్వహించారు. వచ్చే శివరాత్రి లోగా షెడ్ నిర్మాణం పూర్తి చేసి, ఆలయం వద్ద జరిగే జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు ఏలేటి సురేష్‌రెడ్డి కుటుంబసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు, సత్యంరెడ్డి, సంగయ్య, సురేందర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట తహసీల్దార్ నిర్మల్‌కు బదిలీ

లింగంపేట, ఫిబ్రవరి 11 : లింగంపేట తహసీల్దార్ సుధాకర్ నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లినట్లు డీటీ చంద్రరాజేష్ తెలిపారు. సుధాకర్ ఆరు నెలల క్రితం లింగంపేటకు బదిలీపై వచ్చారు. ఆయన స్థానంలో లింగంపేటకు ఇప్పటి వరకు ఎవరిని కేటాయించలేదని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గాంధారి, ఫిబ్రవరి 11: గాంధారి మండల కేంద్రానికి చెందిన కడెం విక్రమ్‌గౌడ్(19) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం రాత్రి తన స్నేహితుడైన గాంధారి గ్రామానికి చెందిన కుమ్మరి లింగమేశ్వర్ పుట్టిన రోజు వేడుకలకు మరో స్నేహితుడు సందీప్‌తో కలిసి ముగ్గురు ఒకే బైక్‌పై వెళ్లారు. వేడుకలు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో గాంధారి గ్రామ పంచాయతీ వద్దకు రాగానే అతివేగంతో సందీప్ వాహనం నడపడంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న విక్రమ్‌గౌడ్ ఎగిరి రోడ్డుపైన పడి తలకు తీవ్రగా యమై అక్కడికక్కడే మృతి చెంది చనిపోయాడని తెలిపారు. మధ్యలో కూర్చున్న లింగమేశ్వర్‌కు సైతం గాయాలయ్యాయని తెలిపారు. మృతుని తండ్రి నారాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన గురుకుల ప్రవేశపరీక్ష

సదాశివనగర్, ఫిబ్రవరి 11: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకు ల మహిళా డిగ్రీ కళాశాలలో 5వ తరగతి గురుకుల ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కళాశాలలో 384 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 362 మంది విద్యార్థులు మాత్రమే హాజరయినట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 11:గాంధారి మండలం గౌరారం గ్రామానికి చెందిన క్రిష్టమూర్తి(19) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 2న కామారెడ్డి బస్టాండ్‌లోని టాయిలెట్‌లో పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నం చేసి హైదరాబాద్ బస్సుఎక్కి జుబ్లిహిల్స్ బస్టాండ్‌లో పడిపోయి అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబీకులు గాంధీఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు సీఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని పాత జాతీయ రహదారి ఇండియన్ పెట్రోల్‌బంక్ ఎదురుగా రాంగ్‌రూట్లో ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌ను తప్పించబోయి కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢికొట్టింది.దీంతో పక్కనే ఉన్న పోలీసు బూత్ సైతం ధ్వంసం అయింది. ఈ ప్రమాదంలో టీవీఎస్ ఎక్సెల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరితో పాటు,బస్సులో ప్రయాణిస్తున్న మరికొంత మందికి గాయాలు అయ్యాయి.మెదక్ నుంచి కామారెడ్డి వైపు ప్రయాణికులను ఎక్కించుకుని వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రాజు పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు సహకరిస్తాం: ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు సహకరిస్తామని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం డిప్యూటి డీఈవో కార్యాలయ పరిధిలో ఉన్న పూర్వ ప్రెస్‌క్లబ్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయి వారికి న్యాయం జరిగేందుకు కృషిచేస్తున్న మీడియా ప్రతినిధులకు వేదిక అనేది ఉండాలని అందుకు ప్రెస్‌క్లబ్ అనేది ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని కలెక్టర్‌తో చర్చించి తగిన తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

భిక్కనూరు, ఫిబ్రవరి 11: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దుబ్బాగౌడ్ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే గంపగోవర్దన్ పరామర్శించారు. ఈ సందర్భంగా దుబ్బాగౌడ్ చిత్రపటానిని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దుబ్బాగౌడ్ మృతికి గల కారణాలను వారి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ నాగర్తి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, లింగారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్, అనీల్, అశోక్, మాణిక్యం, గంగారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 11: పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని డెయిరీ టెక్నాలజీ విద్యార్థులు రైతులకు సూచించారు. ఆదివారం తాడ్వాయి మండలం సంతాయిపేటలో ఇంటింటికి సర్వే నిర్వహిస్తు పాల ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. పాల ఉత్పత్తితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ప్రతిరైతు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఉమాపతి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తలమడ్లలో అపూర్వ సమ్మేళనం

రాజంపేట, ఫిబ్రవరి 11: మండలంలోని తలమడ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 1998-99 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం జంగంపల్లి కస్తూరిబాపాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

క్రీడాకారుల ఉత్తమ ప్రతిభ

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 11: జిల్లా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ క్రీడాకారులు హైదరాబాద్‌లోని గచిబౌలిలో నిర్వహించిన క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నరేష్ తెలిపారు. చంద్రశేఖర్‌గౌడ్ అథ్లెటిక్స్ 400 మీటర్స్ విభాగంలో గోల్డ్‌మెడల్, నరేష్ 400 మీటర్స్‌హర్డిల్స్‌లో సిల్వర్ మెడల్, సతీష్ షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 11: కామారెడ్డి పట్టణ శివారులోని కృష్ణాజీవాడి ఆలయం వద్ద టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టగా బోలేరో వాహనంలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు గుర్తించారు. టీఎస్ 12 యూసీ 2758 అనేనంబర్‌గల వాహనంలో భువనగిరి జిల్లాకు చెందిన బోనసోత్ నరేష్ బియ్యాన్ని తరలిస్తున్నాడని సీఐ తిరుపయ్య తెలిపారు. వాహనాన్ని, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.



కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 11: నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహ పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దోమకొండ, ఫిబ్రవరి 11:మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం 29వ వార్షికోత్సవాన్ని 13న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దామోదర్, ఆనంత్,గుడ్ల విజయ్, జగదీశ్, సురేష్, సబ్బని ప్రవీణ్ కుమార్, శంకర్, కన్న చంద్రబాబు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 11: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన మన్నె అనిత (24) అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. మన్నె అనిత శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి ఇంట్లో పడుకొని ఉండగా, తెల్లారి చూసే సరికి ఇంట్లో ఆమె లేదని తెలిపారు. కుటుంబ సభ్యులు ఆమె కోసం చుట్టూ పక్కల, బంధువుల వద్ద గాలించిన ఆమె ఆచూకి లభించలేదన్నారు. అనిత సోదరుడు ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు మార్కండేయ జయంతి ఉత్సవాలు

దోమకొండ, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ జయంతి ఉత్సవాలు నేడు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రోజున శ్రీ ఉమా మహేశ్వరుల, సీతారాముల కళ్యాణోత్సవం, నవగ్రహ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో పూజలు మధ్యాహ్నం అన్నదానం ఉంటాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాజరవుతారని సభ్యులు తెలిపారు.

నూతన ఎస్సైకి సన్మానం

దోమకొండ, ఫిబ్రవరి 11: మండలంలో నూతన ఎస్సైగా బాధ్యత స్వీకరించిన గణేష్‌ను ఆదివారం కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ తాటిపల్లి శ్రీకాంత్, యూత్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్

కామారెడ్డి ఆసుపత్రిని పరిశీలించిన టీవీవీపీ కమిషనర్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఐసీయూలో ముజిబ్ అనే రోగిని ఎలుకలు గాయపరిచిన విషయాన్ని తెలుసుకుని జరిగిన సంఘటనపై విచారణ జరిపేందుకు, లోటుపాట్లను గమనించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రి పరిసరాలలో ఎలుకల సంతతి పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించామని తెలిపారు. ఆసుపత్రిలో నిర్మాణాలు చేపట్టడం, పేషంట్లతో పాటు వస్తున్న వారు ఆయా విభాగాల పరిధిలో భోజనాలు చేస్తూ వ్యర్థాలను అక్కడే పడేస్తుండడంతో ఎలుకల సంతతి పెరిగిపోతుందని సిబ్బంది పేర్కొన్నారని వారు ఇచ్చిన వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు సానిటేషన్ పనులను సక్రమంగా చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. అదేవిధంగా ఐసీయూలో ఎలుకల సంచరిస్తున్నా విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ఆంగ్లభాష బోధన

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 11: రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ సహకారంతో విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోవర్ధన్ తెలిపారు. ఆదివారం కళాభారతీలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో పలుఅంశాలపై రామేశ్వర్‌గౌడ్ వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి కూడా తెలుగు మాట్లాడినట్లుగానే ఇంగ్లీషు మాట్లాడేట్లు చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం రమేష్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటివరకు 22 జిల్లాల ఉపాధ్యాయులకు ఈ తరగతులను పూర్తిచేశామని, అలాగే ఎసీఈఆర్‌టీ సహకారంతో మొత్తం తెలంగాణలో మిగితా జిల్లాలకు కూడా క్లాసులు త్వరలో పూర్తిచేస్తామన్నారు.

మాదక ద్రవ్యాల కేసుల పరిశోధనపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ రంగనాథం

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 11: మాదకద్రవ్యాల కేసుల పరిశోధన, నిందితులపై కఠిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా పోలీసు అధికారులకు, రైటర్లకు ఆదివారం ఎస్పీ కార్యాలయంలో కస్టమ్స్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ రంగనాథం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లో ప్రథమ సమాచార నివేదిక నుండి నిందితులపై అభియోగ పత్రం వేసేంత వరకు చేయాల్సిన విధి విధానాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిగా వివరించడం, రాష్ట్ర ప్రభుత్వ మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు చేస్తున్న కృషిలో పోలీసు శాఖ యొక్క పాత్ర అతి ముఖ్యమైందని తెలిపారు. అనంతరం ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ఎవరైనా తీసుకున్న, కలిగి ఉన్న, అమ్మకాలు, కొనుగోలు, రవాణా చేసిన వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహరెడ్డి, డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో బోర్ తవ్వకం

సదాశివనగర్, ఫిబ్రవరి 11: ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని ఎస్సీ కాలనీ పోచమ్మ ఆలయం ప్రాంతంలో నీటి ఎద్దడి తీర్చేందుకు ఎమ్మెల్యేమదన్‌మోహన్ ఆదివారం బోరు బావి తవ్వించేందుకు సహకరించినట్లు మండల నాయకులు తెలిపారు. కాలనీలో నీటి ఎద్దడి తీరడంతో ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇర్షాదుద్దీన్, కాంగ్రెస్ పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు ఎస్సైల కేటాయింపు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 11: కామారెడ్డి జిల్లాలోని ఆయా మండలాలకు ఇతర జిల్లాలనుంచి ఎస్‌ఐలు బదిలీపై వచ్చారు. మద్నూర్ ఎస్‌ఐగా అరుణ్, బిచ్కుంద ఎస్‌ఐగా మోహన్‌రెడ్డి, పిట్లం ఎస్‌ఐగా నిరేష్, నిజాంసాగర్ ఎస్‌ఐగా సుధాకర్, బీర్కూర్ ఎస్‌ఐగా రాజశేఖర్, తాడ్వాయి ఎస్‌గా వి.హరీష్‌లు బదిలీ అయ్యారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

బీర్కూర్, ఫిబ్రవరి 11: బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సూచించారు. ఆదివారం బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. నియోజక వర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ మేరకు నసురుల్లాబాద్ గ్రామంలో సొంతంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నానని చెప్పారు. ఆయన వెంట బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్, బస్వరాజు పటేల్, నూతన అధ్యక్షుడు గంగోండ, శివ దేశాయ్ తదితరులు ఉన్నారు.



బరంగేడ్గి గ్రామ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	హనుమాన్
శాంతి	గుంటూరు కారం
ప్రియా 70	ఈగల్, లాల్ సలాం
ప్రియా 35	యాత్ర-2

బాన్సువాడ	
మహేశ్వరి	ఈగల్
వెంకటేశ్వర	లాల్ సలామ్

ఫోటోరైటప్
గ్రామ కమిటీ

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

